# మెత్తని శిక్ష

పి. శ్రీదేవి

జీవితంలోని ఒక్కొక్క అనుభూతి కాలక్రమంలో స్ఫురణకే రానంతగా దూరమయిపోతుంది. కాని ఏ లిప్తపాటు కాలంలోనో తత్సంబంధమయిన మరొక అనుభూతిని పొందగానే- పాత పుటలన్నీ వాటంతటవే తిరుగబడుతాయి. అలా గతాన్ని వెనక్కి వల్లె వేసికొన్నప్పుడు "ఆశ్చర్యం" అనిపిస్తుంది "ఆ నాటికీ ఈ నాటికీ ఎంత వ్యత్యాసం? జీవిత దృక్పథంలో!" అనుకోక తప్పదు

విత్తు మొలకై లేచినప్పటికీ, చెట్టయి ఆకాశాన్నంటుతున్నప్పటికీ భేదం ఉండదూ మరి! కాని ఆ నాటి మొలకకూ ఈ నాటి చెట్టుకూ ఆధారం ఆ వ్రేళ్లే. వ్రేళ్లతోటే పెల్లగింపచేసే అనుభవాలు కలిగినప్పుడు "ఆకాశాన్నంటుకుంటున్నాం" అని విర్రవీగుతూ కూర్చుందుకు ఫీలా? "భూమిలో మనలోతు ఎంత ఉంది" అని ఆలోచించక తప్పదు.

అప్పుడే కోర్టుకువెళ్ళి నా కారులో తిరిగి వస్తున్నాను. ప్రక్కనే మిత్రుడు సుందర్రావు ఇవ్వాళ కేసుగురించిన తమాషాలన్నీ చెప్తున్నాడు. ప్రాసిక్యూటరును ఎలా బోల్తా కొట్టించిందీ, ఇతర సాక్ష్యాలనెలా సమకూర్చుకున్నదీ- "ఎన్ని సాక్ష్యాలున్నా లాయరెంత గటివాడైనా మీ సహాయం లేనిదే పనిజరిగేదే కాదనుకోండి. మీ మేలు ఎప్పటికీ మరిచిపోను," అన్నాడతడు.

నేను గర్వంతో అతనివైపు చూసి, "ఇదేమంత ఘనకార్యం కాదండీ-డాక్టరుగా ఈ మాత్రపు సహాయం చేయవలసిన అవసరాలెన్నో ఉంటాయి మాకు. ఇంతకీ ఇదేమంత పెద్ద నేరంలెండి.

కథానిక

ఈరాష్ట్రంలో దీనిని చట్టరీత్యా నేరమన్నారు. మరికొన్ని రాష్ట్రాలలో స్వేచ్ఛగా మద్యపానం చేసికోమన్నారు," అన్నాను.

సుందర్రావు లక్షాధికారి, ఊళ్లో మంచి పరపతిఉన్నవాడు. అతడు త్రాగుతాడని అందరికీ తెలిసిన విషయమే. కాని యిదివరకంతా పోలీసులకు పట్టుబడే అవసరం రాలేదు. ఇప్పుడూ వచ్చేదికాదు. కాని క్రొత్తగా వచ్చిన సబ్ ఇనస్పెక్టరు కొంచెం కరుకుమనిషి. చిన్నా పెద్దా లేకుండా అనుమానం కలిగిన వాళ్ళందరిపైన ప్రొహిబిషనుకేసులు పెట్టున్నాడు

ఒకనాటిరాత్రి సుందర్రావు పోలీసుల సహితంగా హాస్పిటలుకు రావటం నాకాశ్చర్యమూ బాధా కలిగించాయి. అతడు నావైపు జాలిగా చూచి "మీరు సహాయం చేయాలి" అన్నాడు వినపడీ వినపడనట్లు. నేను మెల్లగా తలూపాను. అతను త్రాగిన మాట వాస్తవమే. సినిమా హాలులో పట్టుకున్నారట

సుందర్రావు, ఆ ఊరికి నాకు ట్రాన్సుఫరు అయిన నాటినుండి పరిచితుడు. అతడు ధనవంతుడు. పలుకుబడి కలవాడు. చూస్తూ చూస్తూ అతనికి శిక్ష పడనివ్వటమేనా!

నేను చేయగలిగిన దేదో చేశాను అతని కేసు కొట్టేశారు. సబిన్సపెక్టరు నా వైపు ఎర్రగా చూశాడు. మేజస్ట్రేటు, "డాక్టర్లే పోలీసులకెదురు సాక్ష్యాలు చెప్తున్నారు" అన్నాడు మరెవరితోనో, నాకు వినబడేటట్లు.

"డబ్బున్నవాడు కదూ - డాక్టరుకు బాగానే ముట్టి ఉంటుంది" అన్నారట లోకులు కొంతమంది.

"అనుకుంటే అనుకోనీ" అని ధైర్యం చెప్పింది నా మనస్సు. యింతకీ వాళ్ళన్నది నిజం కాదు కనుకనా?

సుందర్రావు నన్ను పొగుడుతూన్నంత సేపూ నాకు మనస్సులో ఏవో మెలివేసినట్లయింది. నేనతనికి సహాయం చేయటం న్యాయానికి విరుద్ధం. అక్రమానికి దోహదం. అదేదో తెలియని బాధ నా మనస్సులో రగిలి పొగలెగసి నన్నుక్కిరిబిక్కిరి చేస్తూంది.

మనస్సు భావనా వీధిలో సాగుతూంది. కారు మెయిన్‌రోడ్ మీద జోరుగా వెళ్తూంది. నేను పరధ్యానంగా డ్రైవ్ చేసికొని పోతున్నాను.

ఇంతలో "అరెరే"అన్నాడు సుందర్రావు, కంగారుగా నా భుజం నొక్కి. ఒక్క లిప్తపాటు కాలంలో జాగ్రదావస్థ కొచ్చి హఠాత్తుగా బ్రేకు వేశాను కారుకు. ఏడెనిమిది సంవత్సరాల కుర్రవాడొకడు కారు కడ్డంగా పరుగెత్తాడు. ఒక్క అడుగులో తప్పిపోయాడు. కాని లేకపోతే కారు క్రింద పడి చచ్చిపోవలసిందే.

"ఎదవా! కారు కళ్లకు కనబడనేదట్రా - అంత తొందరెందుకూ! నాతోపాటు నడిచిరాక ముందెందుకు పరిగెత్తావు?" అంటూ ఆ అబ్బాయి తండ్రి కాబోలు, వాడి వెంట పరుగెత్తు కొచ్చి వాడి రెక్క పట్టుకున్నాడు.

నేను కారులోంచి బయటకి వచ్చి, "చచ్చి పోవలసిందే - కొంచెంలో తప్పాడు కాని. దెబ్బలేమైనా తగిలాయా"? అన్నాను.

"మోకాలుకు కాస్త దెబ్బ తగిలిందండి. చిన్న దెబ్బేలెండి. అయినా యీ ఎదవకు బుద్ధి నేదండి. యిల్లు కదిల్తే తిన్నగా తిరిగొస్తాడో లేదోనని బెంగేనండి" అన్నాడతడు

అతని వైపు చూస్తూంటే ఏదో పరిచిత ముఖం గుర్తు కొస్తూంది కాని స్పష్టంగా గుర్తుకు రావటంలేదు

"ఎక్కడో చూసిన మనిషేమో-" అనుకున్నాను.

ఇంతలో అతనూ నావైపు పరికించిచూశాడు. ఒక్కసారి అతడి మొహ మింతయింది. "డాక్టరు బాబుగారూ! మీరా బాబూ, మీరా! ఎన్నాళ్ళకు చూశాను? నేను రాముల్నండీ. నేను తాగి జైలుకుపోతే తమరు నా భార్యా బిడ్డల కెంత సేసినారండి...."

నా తలలో ఒక్కసారి వెయ్యిరైళ్ళు పరుగెత్తి నట్లయింది. 'నువ్వా!' అనిమాత్రం అనగలిగాను.

"అవునండి. తమరప్పుడు సీతానగరంలో ఉండేవారు కదండి? బాబూ, మీరు బతికించిన బిడ్డ ఈడేనండి. ఆ నాడో సావు తప్పింది. ఇయ్యాలో సావుతప్పింది. రెండుసార్లూ తమరే బతికించినారండి. మీ పేరుమీదుగా బతకాల్సినాడని నా కప్పుడే తెలిసిందండయ్యగోరూ— అందుకే కదండయ్యా ఈడిని తమరి పేరెట్టి పిలుత్తాను" అతను చెప్పుకుపోతున్నాడు. నేను వినలేని స్థితిలో ఉన్నాను.

"సరేలే! మంచిది. ఇదిగో యిదిపెట్టి వాడి కేదైనా కొనిపెట్టు" అంటూ జేబులోంచి ఒక నోటు తీసి యిచ్చాను. పదో అయిదో కూడా చూసుకోలేకపోయాను. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి నాకు. అతడంతటితో నన్ను వదిలిపెట్టలేదు. "అమ్మమ్మ! ఎంతమాట. తమరికింకా యిబ్బంది సేస్తానా బాబూ. వద్దండి నా కిప్పుడు కూటికి కరువులేదు తాగుడు మానేసినానండి. ఆళ్ళిద్దరూ సచ్చిపోయారన్న దిగులు తప్ప ఇంక నాకే విశారమూ లేదండి" అని నేనిచ్చిన నోటు నాకు తిరిగిచ్చేయబోయాడు.

నేను, "ఫరవాలేదు ఉండనీ" అంటూనే కారును పోనిచ్చాను.

సుందర్రావు నా వైపు వింతగా చూశాడు. ఏదో అడగబోయాడు కాని, నా ముఖం చూచి ఏమనుకున్నాడో ఊరుకున్నాడు. అతడు త్రోవలో దిగిపోయాడు.

ఇంటికి వెళ్ళాను కాని, మనస్సు భరించలేనన్ని ఆలోచనలతో నిండిపోయిబరువెక్కింది. అవును బరువెక్కక ఏంచేస్తుంది!

సరిగ్గా నేనీనాడు ఏ న్యాయానికైతే విరుద్ధంగా ప్రవర్తించి సుందర్రావుకు సహాయం చేశానో, అదే న్యాయం పేరిట ఆ నాడు రాములుకు సహాయం చేయలేకపోయాను.

ఏడు సంవత్సరాల క్రిందట మాట—

పగలంతా తీవ్రమైన ఎండకాసి వాతావరణ మంతా వేడెక్కిపోయింది. వేసవికాలపు రాత్రి-నిద్రపట్టక పట్టక పట్టింది. ఏదో తీయని కల-స్వాప్నికావస్థలోని మధురానుభూతితో పరవశమై యున్నవేళ, "ఏమండీ! ఏదో కేసు వచ్చిందని వార్డుబోయ్ వచ్చాడు!" అని తట్టి లేపింది మా శ్రీమతి చక్కని నిద్ర కాస్తా భంగపడింది. తీయని కల కరిగిపోయింది-విసుగుగా లేచాను.

వరండాలోకివచ్చి, "ఏం కేసు?" అన్నాను.

వార్డుబోయ్, "త్రాగుడు కేసు సార్" అన్నాడు.

ఎవడో త్రాగి మత్తెక్కినవాడి కోసం అర్ధ రాత్రి ఒంటిగంటవేళ నిద్ర చెడుపుకుని పని చేయటం-ఏం న్యాయం యిది? రోగగ్రస్థుడైన మానవునికోసం ఒకరాత్రంతా నిద్ర పోగొట్టుకున్నా అందులో ఏదో తృప్తి ఉంటుంది కాని ఇదలాకాదు అవతల వ్యక్తి అతడి వ్యసనం మానుకోలేక అతడి ఆనందంకోసం త్రాగుతాడు. ఉద్యోగ ధర్మంకోసం అతనిని డాక్టరు పరీక్ష చేసి సర్టిఫికెటు యివ్వాలి అది అర్ధరాత్రయినా మరెప్పుడయినా సరే-ఇది నాకు క్రొత్త కాదు అయినా నిద్ర భంగపడిందనే చిరాకులో చాలా విసుగుగా హాస్పిటలుకు వెళ్ళాను.

త్రాగిన మనిషి స్పృహ లేకుండా పడి ఉన్నాడు వంటిని మాసిపోయి చినిగిపోయి అక్కడక్కడ బురదకూడా పట్టించుకున్న బట్టలున్నాయి-మనిషి దృఢకాయుడే-కూలి జాతికి చెందినవాడని అతని రూపమే చెబుతూంది. మధ్యమధ్య ఆ మైకంలోనే ఏవేవో పరాకుమాటలంటున్నాడు నేలపడి దొర్లుతున్నాడు. పోలీసువాళ్ళనడిగాను, ఏమిటి సంగతని సినిమారోడ్డు మలుపుదగ్గిర ఈ స్థితిలోనే నేలమీద దొర్లుతూ పడిఉన్నాడట గస్తీ పోలీసులు చూచి రిక్షామీద తీసుకుని వచ్చారు-అతనికి వంటిమీద అక్కడక్కడ చిన్నచిన్న దెబ్బలుకూడా ఉన్నాయి ఘాటయిన సారావాసన అతడు త్రాగినవాడని అల్లంత దూరానికికూడా చెపుతూంది అతనిని పరీక్షచేశాను మనిషి ఆరోగ్యంగానే ఉన్నాడు. విపరీతంగా త్రాగటంవలన స్పృహ లేకుండా పడిపోయాడు. త్రాగాడనీ, మత్తులో ఉన్నాడనీ సర్టిఫికెటు వ్రాసి యిచ్చాను.

"ఇతనికేం. ప్రమాదం లేదుకదా సర్" అన్నాడు కాన్సటేబిల్.

"ఏమీలేదు. ప్రొద్దుటికి తెలివి వచ్చేస్తుంది. జాగ్రత్తగా తీసుకు వెళ్ళి పడుకో బెట్టండి" అన్నాను.

వాళ్ళతనిని తీసుకుని వెళ్ళారు.

తెల్లవారి యింకా చీకటి విడనేలేదు. అప్పుడే లేచి ముఖం కడుక్కుంటున్నాను. ఇంతలో ఒక ఆడమనిషి ఏడుస్తూ మా నాకిట్లోకి వచ్చింది.

"బాబుగారు-తమరు రచ్చించాల. తమరు దయసూపకపోతే మా గతేం కావాల!" అంటూ నా కాళ్లమీద పడబోయింది. నేను వెనక్కి తప్పుకుని, "ఏం! ఏం జరిగింది చెప్పు-ఎవరికైనా జబ్బు చేసిందా?" అన్నాను.

"రాత్రి నా పెనిమిటిని జైల్లో ఏసినారంట. తమరు పరీచ్చ చేసి త్రాగినాడని రాశారంట. మీ పాదాలట్టుకుంటా నయ్యగోరూ-మావోడి నిడిపించండి" అన్నది ప్రాధేయపడుతూ.

"నేనేం చేశే దమ్మాయి. వాడు బాగా తాగి తెలివి తప్పిపోయి రోడ్డుమీద పడి ఉన్నాడట. పోలీసుల కంటబడ్డాడు. వాళ్ళూరుకుంటారా మరి."

"తమరు గొప్పోరు. మాలాంటి పేదోళ్ల నొక కంట సూడకపోతే ఎలా బాబూ? కూలినాలి చేసి బతికేవాళ్లం. నేను సంటి బిడ్డతల్లిని ఆడు సంపాదించకపోతే మాకు కూడే నేదు బాబూ. నా బిడ్డకి మూన్నాళ్లయి ఒళ్లు తెలవని జరం కాస్తూందదయ్యా - ఆళ్ల బాబు దగ్గిరనేకపోతే బెంగెట్టుకుని ఏమౌతాదో-మీరు సెపితే యిడిపిత్తారట కదండి బాబయ్యా" అన్న దామె జాలిగా విలపిస్తూ.

ఆమె వయస్సు ఇరవై సంవత్సరాలకు మించి ఉండదు మాసిన జీర్ణవసనం ఆమె పేదతనాన్ని వర్ణిస్తూంది చాలా అమాయకంగా జాలిగా ఆశగా నావంక చూస్తూంది.

నేనేదో పెద్ద ఉద్యోగిని, నేను చెపితే తన భర్తను జైలునుండి విడిపించేస్తా రనుకుంటూం

దామె పాపం! న్యాయశాస్త్రపు కట్టుదిట్టా లేమీ తెలియని అమాయకురాలు. ఆమెను చూస్తే నాకు జాలివేసింది. ఇంతలో ఆమె భర్తను తల్చుకుంటే కోపం వచ్చింది. ఈమె యిలా బ్రతిమాలుతూంది కాని వాడెంత దుష్టుడు- చిరాకుతో అన్నాను "వాడికంత బుద్ధి లేక పోతే ఎవరేం చేయగలరు? తినటానికి తిండి లేనివాడు త్రాగుడెందు కలవాటు చేసికోవాలి? అంత విపరీతంగా త్రాగి రోడ్లంట దొర్లుతూంటే ఎలా ఊరుకుంటారు?"

నా మాటలతో ఆమె మరింత గోలుగోలున ఏడ్చింది "అదికాదయ్యగారూ-ఆడు చాలా మంచోడేనండి ఎప్పుడూ తాగి ఎరగడండి ఈ పాపిష్టిదాని వొల్లే ఆడి రాతిలా గయిందండి. మొన్నొకనాడు ఆడికీ నాకూ పెద్ద దెబ్బలా టయిందండి. ఆ కోపంలో నన్ను కొట్టి ఎటో పోయాడండి. ఆ రేతిరంతా మరి రానే లేదు నిన్న పొద్దుగూకులేల ఒచ్చినాడు. నాకూ ఒల్లు మండి, నాదరికి రాకు పో! అన్నానండి అసలా డప్పటికే కొంచెం తాగినాడోయేమో-ఇంత పని జరిగిందండయ్యా! తప్పంతా నాదేనండయ్య గోరూ-తమరు రచ్చించాల. ఆడినిడిపించక పోతే నే నసలు బతకనండయ్యా."

ఆమె చెప్పిన దంతా విని జాలిపడటం కంటే నేనేం చేయగలను? అతడెందుకు తాగాడో న్యాయస్థానంలో అనవసరం. అతడు తాగాడు డాక్టరుగా నా ధర్మం నేను నెర వేర్చాను.ఇప్పుడీమెకు నేనేం సహాయపడగలను? అతడు త్రాగి మత్తెక్కి ఉన్నాడని వ్రాసి యిచ్చేశాను కదా!

"నేను వ్రాసి ఇచ్చేదేదో యిచ్చేశానమ్మాయి. నేనేమీ చేయలేనింక. కోర్టులో విచా రించినప్పుడు మేజిస్ట్రేటుగారివద్ద తప్పు ఒప్పుకుని క్షమాపణ కోరుకోమను వారే కొంత శిక్ష తగ్గించ వచ్చు," అంటూ ఆమెనుండి తప్పించు కుందుకు లోపలికి వెళ్ళిపోయాను.

కాని ఆ దినం అంతా నా మనస్సులో ఆమె ఆర్తనాదం విన్పిస్తూంది. కూటికి లేనివాళు భర్త సంపాదించి తెస్తేనే కాని భార్యా పిల్లలు వస్తులుండాలి. పిల్లల తల్లి, చంటిబిడ్డ తల్లి తానేం కష్టపడగలదు. బిడ్డకు జబ్బుగా ఉందన్నది. వాళ్ళ గతేంకాను?

కాని యిందులో నా తప్పేముంది! నా విధి నేను నిర్వర్తించాను. నేను వాడు త్రాగలేదని వ్రాస్తే వాడిని విడిచి పెట్టేద్దురు. కాని అబద్ధం వ్రాయటమెలా? అయినా అప్పటికి వాడి స్థితి గతులు నాకు తెలియవు. అందరినీ చూసి వ్రాశేసినట్లే వ్రాశేశాను. అయినా వాడిని గురించి ముందుగా తెలిస్తేమాత్రం అబద్ధం వ్రాయగలనా అలా? వ్రాయాలనుకుంటే ఎంత మంది అతడిలాంటి వాళ్లు లేరు! వాళ్ళందరినీ నేను రక్షించగలనా! త్రాగిన వాడికి త్రాగలేదని అబద్ధపు సర్టిఫికెటు యిస్తే నా విద్యుక్త ధర్మాన్నతిక్రమించినట్లు కాదూ?. .....ఇలా మనస్సు పరిపరి విధాల పోయింది.

నా డ్యూటీ ప్రకారం జైలులో ఖైదీలను చూడటానికి వెళ్ళాను అతడు కన్పించాడు. త్రాగిన మత్తు పూర్తిగా పోయి మామూలు స్థితికి వచ్చాడు. కళ్ళల్లో ఆదుర్దా, విచారం కన్పిస్తున్నాయి నేను వెళ్ళగానే "దండం బాబుగారూ" అన్నాడు.

"ఏం, వంట్లో ఎలాగుంది?" అన్నాను

"తమరి దయవల్ల బాగానే ఉంది తప్పు సేసాను బాబూ! క్షమించండి. రెన్నెల్ల క్రితం తమరు నా కాలుకు దెబ్బతగిల్తే బాగుచేశా రయ్యా! మూడు రోజులలో నయమైపోయింది ఆ కాలు నయమయ్యేదాకా యింట్లో ఆడది వస్తులేనండి. తమరి కెరుకలేనిదేంటి బాబూ- పేదోళ్ళం. కూలినాలి చేసుకునేవోళ్ళం-నన్నిడి పించండి బాబూ," అన్నాడు. నా బదులు కాన్‌స్టబిలే జవాబుచెప్పాడు, "ఈ అయ్యగారేమీ చెయ్యలేరు. మేజస్ట్రేటుగారిని బ్రతిమాలుకో కోర్టులో" అని.

కాని ఆ ఖైదీ అంత ప్రపంచ జ్ఞానంలేని వాడుకాడు. వాడికి న్యాయస్థానపు పద్ధతులన్నీ తెలును. అందుకే "తమరు సాచ్చం సెపుతా రటకదయ్యా! నామీద కాస్త దయుంచండి. తమరు సెయ్యలేనిదేంటి?" అన్నాడు. అవును నిజమే. నేను సాక్ష్యం చెప్పాలి. నా సాక్ష్యం

మీదనే కేసంతా ఆధారపడి ఉంటుంది. ఆ సంగతి తెలిసే వాడలా అర్థించాడు.

కాని-వాడిని విడిపించాలంటే వాడు త్రాగ లేదని చెప్పాలి త్రాగటంవలన మత్తురాలేదు, మరేదో కారణంగా వచ్చిందనాలి. అంటే అబ ద్ధపు సాక్ష్యం చెప్పాలి నేనేం చెప్పినా కోర్టులో విశ్వసనీయంగా పరిగణింపబడుతుంది గవర్న మెంటు డాక్టరుగా నా సాక్ష్యానికి విలువఉంది కాని అపరాధి నిజం చెప్పినా కోర్టు మన్నిం చదు. అతనికెంతో కొంత శిక్ష తప్పదు, మేజ స్ట్రీటు మరీ దయగలవాడైతే తప్ప

కాని నేనితని గురించి సర్టిఫికేటు యిచ్చే శాను ఇప్పుడితనికి సహాయం చేయాలంటే నా సర్టిఫికేటులోని విషయాన్ని మరుగుపరచి మాటమార్చి-అతడు త్రాగలేదని చెప్పాలి. అదే మంత మరీ కష్టమయిన పనికాదు. కాని "దేముని యెదుట" అని ప్రమాణం చేసి అబద్ధం చెప్పటమెలా?.........నా పిచ్చిగాని కోర్టులో సాక్షులందరూ నిజమే చెబుతున్నారా? వాళ్ళందరి విషయం వేరు-నేనొక బాధ్యతా యుతమైన ఉద్యోగంలో ఉన్నాను. నాఉద్యోగ ధర్మం నేను నిర్వర్తించక తప్పదు....

అయినా వాడికోసం నేనబద్ధం ఆడి నా వర్తనాన్ని కలుషితం చేయాల్సినంత అవసర మేముంది. వాడు నిజంగా పొరపాటుచేశాడు- వాడు త్రాగటం అబద్ధం కనుకనా!

ఏదో పొరపాటు చేశాడు - వాడి కుటుంబ మంతా క్షోభిస్తుందీ ఒక్క పొరపాటుకు. ఇంతకీ వాడు తప్పు ఒప్పుకున్నాడు. పశ్చాత్తాపంతో క్రుంగిపోతున్నాడు. దీనంగా వేడుకుంటున్నాడు. ఒక్క అబద్ధం ఆడైనా ఒక్క వ్యక్తికి ఉప కారం చేస్తే అది తప్పా!

మళ్ళీ ఒక అడ్డు ప్రశ్న-"ఇలా ఎంత మందికి సహాయం చేయగలవు. రోజు కెంత మంది ఈ నేరం క్రింద శిక్షితులవుతున్నారో వారందరికీ చేయగలవా?"

పోనీ జాలిపడి ఒకసారి శిక్షనుండి తప్పిస్తే మళ్ళీ నేరం చేయకుండా ఉంటాడా? శిక్ష అనుభవించినంత మాత్రాన దొంగతనం చేసే వాడి బుద్ధి, త్రాగి మత్తెక్కేవాడి బుద్ధి మారు తుందా? జైలునుండి విడుదలయిన మర్నాడే ఆ పని చేస్తాడు. ఎంతమందిని చూడటంలేదు.

కొందరైనా సుశిక్షితులవుతారనేగా ఈచట్టాలూ, శాసనాలూ, శిక్షలూను న్యాయమనేది చట్ట బద్ధంగా మానవుని సుశిక్షితుని చేయటానికే గదూ- ఆ న్యాయాన్నే ధిక్కరిస్తే?

మనస్సులో ఒక పెద్ద సంఘర్షణ - ఒక ద్వంద్వ యుద్ధం జరుగుతూంది

నాలోని మానవత్వం ఆ పేద ఖైదీపై జాలి పెంపొందించుకుంటూంది. ఇంతకీ అతని పొరపాటేమంత పెద్దది! ఎవరి సొమ్మూ దోచు కోలేదు ఎవరినీ హత్య చేయలేదు. ఎవరినీ హింసించలేదు ఎవరికీ అపకారం చేయలేదు. తాను సంపాదించిన డబ్బు వెచ్చించి మద్య పానం చేశాడు. ఇదేమంత పెద్దనేరమా?

ప్రభుత్వోద్యోగిగా నేను పెంపొందించుకున్న వ్యక్తిత్వం నా మనస్సుకు బుద్ధి చెప్పింది. "చట్టాన్నుల్లంఘించటమే తప్పు. తప్పు పని ఏదయినా ఒకటే - అందులో ఎక్కువా తక్కువా ఏమిటి?" అని ప్రబోధించింది క్రొత్తగా ఉద్యో గంలో చేరాను నీతిగా నియమంగా బ్రతకాలనే కాంక్షలింకా గుములుకొంటూనే ఉన్నాయి. మనస్సాక్షికి విరుద్ధమైన పనేదీ ఎంతమాత్రం చేయకూడదనే నిబ్బరం ఇంకా సడలని రోజు లవి. మమతలూ మైత్రులూ మోహపెట్టలేని నిగ్రహం ఇంకా ఉన్న రోజులవి. ధనాశతో నైతికపరిధుల నతిక్రమించలేని చిన్నతనమది.

"రాములు త్రాగి మత్తులో ఉండటం నిజం. నే నతనిని పరీక్షచేశాను," అని కోర్టులోచెప్పాను, మనస్సులో బాధ పడుతూనే. వాడు బోనులో నుండి నా వైపు దీనంగా చూచిన చూపు యిప్పటికీ నాకు గుర్తుంది.

అతనికి మూడు నెలలు శిక్ష వేశారు. రాజ మండ్రికి పంపించారు అతడిని పంపించిన మరునాడే కాబోలు, అతని భార్య తన నాలు గేళ్ల కూతురును తీసికొని వచ్చింది ఆ పిల్లకు జ్వరం తీవ్రంగా వచ్చింది తండ్రిని గురించి బెంగ పెట్టుకున్నదని ఆ పిల్ల తల్లి నాతో చెప్పు కుని ఏడ్చింది. నేనా అమ్మాయిని హాస్పిట లులో చేర్చాను. జ్వర మంతకంతకు తీవ్రమై

టైఫాయిడు రూపం దాల్చింది. ఫర్వాలేదనే ధైర్యంతోటే చాలా కష్టపడి చికిత్స చేశాను. కాని అంతకంతకూ పరిస్థితి విషమించింది. పిల్ల జబ్బుకు లొంగిపోయింది. జబ్బు మందుకు లొంగలేదు.

పరిస్థితి నర్థంచేసుకున్న తల్లి మరింత కృంగి పోతూంది ఆమెకు రెండునెలల కొడుకు ఆ పసిగుడ్డును హాస్పిటలుకు తీసుకురావద్దని అది అంటుజాఢ్యమని చాలా వారించాను.

వీడి నెవరికిచ్చివచ్చేది, తండ్రి దగ్గరలేడు కదా? అనేదామె. మాటిమాటికీ - తండ్రిమాట గుర్తుచేసినపుడల్లా నేనేదో అపరాధం చేసినట్లు బాధపడేవాడిని కష్టపడి కనిపెంచిన తల్లి హృదయాన్ని గగ్గోలుచేసి ఆ అమ్మాయి శాశ్వతంగా కన్నుమూసింది

ఆమె రేపు చనిపోతుందనగా తల్లికి జ్వరం వచ్చింది. మరిరెండు రోజులకు ఆ పసిపిల్ల వాడికికూడా జ్వరమే. ఆ రోజుల్లో నేను పడిన బాధను వర్ణించడానికి నాకు మాటలు రావు భర్త జైలుకుపోవటం, భార్యాబిడ్డలు అస్వస్థులై ఒక్కొక్కరే మృత్యువుకు బలియైపోవడం— ఆ కుటుంబం సర్వనాశనమై పోవడం- ఇదంతా నాకు తీరని బాధ కల్గించింది.

నేనిందులో దేనికీ బాధ్యుడను కానని తెలుసును కాని, బాధపడక తప్పలేదు.

ఆమెకు జ్వరం వచ్చినప్పటినుండి ఒకటే పేలాపన. సంధివాతమున బడింది. చని పోయిన పిల్ల, దగ్గరలేని భర్తనుగురించి కలువరించని నిముషంలేదు. చివరికి ఆమెకూడా నా చికిత్సలను వెనక్కినెట్టి మృత్యుగర్భంలోకి సాగిపోయింది. రెండునెలల పసిగుడ్డు మాత్రం పదిరోజులు జ్వరం కాశాక మళ్ళీ ఈ లోకంలోకి కళ్ళువిప్పి చూశాడు.

అభాగ్యుడు, ఒక్కనెలలో భార్యాబిడ్డల నిద్దరినీ కోల్పోయాడు. వాడొస్తే ఏమంటాడు? నువ్వే నన్ను సర్వనాశనం చేశావు నేను తాగానని నువ్వు సాక్ష్యంయివ్వబట్టి నాకుజైలుశిక్ష. నేను జైలులో పడబట్టి నా భార్యబిడ్డలు బెంగపెట్టుకుని చచ్చిపోయారు అని ఆవేశంతో నన్ను నిందిస్తాడు, అని తల్చుకుని వణికిపోయాను.

ఇంతలో నాకాఆపద రాకుండానే ట్రాన్సుఫరు అయింది. తల్లి తండ్రీ లేని ఆ చిన్నవాడిని నర్సుకు వప్పచెప్పి వాడు జైలునుండి తిరిగి వచ్చేదాకా జాగ్రత్తగా పెంచి వాడికవ్వచెప్పమని చెప్పి వెళ్ళిపోయాను. అంతే-ఆ నాటితో ఆ సంఘటన తాలూకు స్మృతులు అలా అలా మరిచిపోయాను.

కాని యిప్పటి జీవిత దృక్పథమే మారి పోయింది. అప్పటి ఆశయాలూ లేవు. ఆ ధర్మ విచక్షణాలేదు జీవితపు మలుపులు ఎక్కువైన కొలదీ జీవిత వర్తనం కూడా పూర్తిగా మారి పోయింది. అందుకే ఈ నాడు సుందర్రావుకు అంత సులభంగా అబద్ధమాడి శిక్ష తప్పించ గలిగాను

నిజానికి సుందర్రావు నేను సహాయం చేయకపోయినా మరొక ఉపాయమేదో చూచుకోగలడు. అతడు ధనవంతుడు, ఏమైనా చేయ గలడు కాని నా స్వార్థంకోసం అతనికి సహాయం చేశాను. అతని అవసరం నాకు చాలా ఉంది. అంటే నిజంగా అతనితోకాదు, అతని డబ్బుతో- అతని పలుకుబడితో. అందుకే సహాయం చేశాను.

సుఖమయ జీవితంకోసం లౌకిక ప్రపంచంలో అవసరమయిన అన్యాయపు అక్రమపు కృత్యాలు ఈ నాడు నా దృష్టిలో సామాన్యమై పోయినవి. అందుకే సుందర్రావులాంటి వాళ్ళకెంతమందికో ఎన్నో సహాయాలు చేశాను. అవన్నీ నన్నేమీ బాధపెట్టలేదు. కాని ఆ నాడు ఆ భార్యా భర్తలిద్దరూ కాళ్ళంటుకుని ప్రాధేయ పడ్డారు— ఎలాగైనా శిక్ష తప్పించమని చేయ లేక పోయాను. తత్ఫలితంగా అతడెంత దుఃఖం అనుభవిస్తున్నాడు, అని తల్చుకున్నప్పుడల్లా మనస్సు విచలితమవుతూంది. ఈ దినం హటాత్తుగా అతడు కనబడి చూపిన కృతజ్ఞతకు నేనెలా అర్హుణ్ణి? భార్యాబిడ్డలను కోల్పోయినంత దుఃఖం అనుభవించీకూడా, అందుకు కారణమాత్రంగానైనా బాధ్యుడనైన నాయందు ఎందుకూ అతనికంత ఆదరం! ఇంతకంటే సున్నితమైన శిక్ష మరొకటుంటుందా? ★